WWW.EPAPER.MAHAADAILY.COM

Follow: @ANNTELUGU

ANN తెలుగు

మహా పత్రిక

ఖమ్మం

18-01-2025

భద్రాద్రి కొత్తగూడెం

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఖమ్మం జిల్లా అగ్రగామి

- జిల్లాలో 99.21 శాతం సర్వే పూర్తి
- అధికారుల కృషితో ఇతర జిల్లాలకు ఆదర్శం

08



# టూరిస్ట్ స్పాట్‌గా వెలుగుమట్ల అభివృద్ధి

**సహజ సిద్ధంగా అటవీ ప్రాంతాలు ఉండటం మన సంపద**

ప్రకృతిని ధ్వంసం చేయడం వల్లే అనేక ఆరోగ్య సమస్యలు

పార్కుల వద్ద ప్లాస్టిక్‌ని బ్యాన్ చేయాలి

వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ను సందర్శించిన మంత్రి తుమ్మల

" వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను టూరిస్ట్ స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.



02

## ధూళి పొరల కింద ఖమ్మం

**పర్యావరణానికి ప్రమాదకరమైన గ్రానైట్ ట్రాఫిక్**

- పర్యావరణానికి ప్రమాదకరమైన గ్రానైట్ ట్రాఫిక్
- ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్న గ్రానైట్ ధూళి
- గ్రామీణ ప్రాంతాల్లో పంటల దిగుబడిపై దెబ్బ
- వాహనాల వేగం నియంత్రణకు నిఘా అవసరం
- టార్పాలిన్ కవర్లు తప్పనిసరి అంటున్న ప్రజలు



03

## రాయలకు ఘన సన్మానం



08

విదేశీ పర్యటనను ముగించుకుని స్వగ్రామంకు వచ్చిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు

# టూరిస్ట్ స్పాట్ గా వెలుగుమట్ల అభివృద్ధి





**ఖమ్మం, జనవరి 17, మహా:** వెలుగుమట్ల అర్జున్ పార్క్ ను టూరిస్ట్ స్పాట్ గా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి స్థానిక వెలుగుమట్ల అర్బన్ పార్కును సందర్శించారు. పార్క్ అభివృద్ధి ప్రణాళిక ను మంత్రి పరిశీలించి, పార్క్ లో కలెక్టర్, అధికారులతో కలిసి మొత్తం పార్క్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం లోపు వెలుగు మట్ల అర్బన్ పార్కును టూరిస్ట్ స్పాట్ గా అభివృద్ధి చేయాలని అన్నారు. ఖమ్మం చరిత్ర నేపథ్యంతో ఆకర్షణీయంగా ఉండే విధంగా వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు మంచి పేరు పెట్టాలని అన్నారు. ఖమ్మంతో పాటు కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాలలో కూడా అర్బన్ పార్క్ ల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సహజ సిద్ధంగా అటవీ ప్రాంతాలు ఉండటం మన సంపదని, జిల్లా కలెక్టర్, డి.ఎఫ్.ఓ మంచి కార్యక్రమాలు తీసుకుంటు ముందు కెళ్తున్నారని, కష్టపడి, మనస్సు పెట్టే అధికారులు ఉన్నప్పుడూ, వీరికి సహకరిస్తూ అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని మంత్రి ప్రజాప్రతినిధులకు సూచించారు. వెలుగుమట్ల అర్బన్ పార్కుకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, కొంత మంది అనాలోచితంగా తమ భూమి సెంటు, గజం పోతుందని ఆందోళన చెందుతున్నారని, ప్రస్తుతం ఉన్న భూమి విలువ కంటే రోడ్డు వేసిన తర్వాత 10 రెట్లు పెరుగుతుందని అన్నారు. రోడ్డు బాగుంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు.

వెలుగుమట్ల అర్బన్ పార్క్ వద్ద ప్లాస్టిక్ వాడకం నిషేదించాలని, ఇక్కడ క్యాంటీన్ లో కూడా చిరు ధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను పెట్టాలని, స్వశక్తి మహిళా సంఘాలచే స్టాల్ ఏర్పాటు చేయాలని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ సంబంధించిన భూమి బౌండరీ ఫెన్సింగ్ చేయాలని అన్నారు. ఫెన్సింగ్ లోపల చుట్టూ రోడ్లు, చెక్ డ్యాంలో నీరు అందుబాటు లో ఉండాలని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి పాత్రికేయులు కూడా సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే తరాలను పార్క్ కు తీసుకొని వచ్చి ప్రకృతిని కాపాడుతూ, అభివృద్ధి సాధించడం ఎలా అనే అంశం తెలియజేసేలా పార్క్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రకృతిని ధ్వంసం చేయడం వల్లే అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, దానిని నివారించేందుకు పార్క్ అభివృద్ధి చేపట్టామని, గత రెండు నెలలుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అర్బన్ పార్క్ ను సందర్శిస్తున్నారని, ఇక్కడి అంశాలు కుటుంబ సభ్యులతో పంచుకుంటున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఖమ్మం నగరానికి పది నిమిషాల దూరంలో 500 ఎకరాలలో పార్క్ ఉండటం అదృష్టమని అన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఈ పార్క్ లు ఉపయోగమని అన్నారు. ప్రతి రోజు ప్రస్తుతం వేయి మంది వరకూ సందర్శకులు వస్తున్నారని, పిల్లలకు అడ్వెంచర్ గేమ్స్ మరిన్ని మౌళిక వసతులు కల్పిస్తే భవిష్యత్తులో రోజుకు 2 వేల నుంచి 3 వేల మంది, వారాంతాలలో 6 వేల వరకూ సందర్శకులు వచ్చే అవకాశం ఉందని, దీనికి వల్ల స్థానిక ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని అన్నారు. ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి సాధించాలని సందేశం ఉగాది, సంక్రాంతి, బతుకమ్మ వంటి పండుగల ద్వారా మన సంప్రదాయంలో ఎప్పటి నుంచో ఉందని, దానిని మనం నిరంతరం పాటించాలని అన్నారు.

కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ, 1977 లో 546 ఎకరాలకు అర్బన్ పార్క్ నోటిఫికేషన్ జరిగిందని అనంతరం భూ పోరాటంలో భాగంగా చాలా వరకు భూమి కోల్పోయామని, 2016లో మంత్రివర్యుల హయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జాయింట్ సర్వే చేసి, దాదాపు 250 ఎకరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గత సంవత్సరం నుంచి మంత్రివర్యులు ప్రత్యేక శ్రద్ధతో ఫాలో అప్ చేస్తూ టి.యూ.ఎఫ్.ఐ.డి.సి నుంచి 3 కోట్లు మంజూరు చేసి ఇక్కడ బోటింగ్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కోటి 28 లక్షల హరిత నిధి నుంచి పార్కుకు మంజూరు అయ్యాయని, ఇక్కడ జింకల పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి వారంలో 5 నుంచి 6 పాఠశాలల నుంచి విద్యార్థులు సందర్శనకు వస్తున్నారని అన్నారు. గతంలో నెలకు 50 నుంచి 60 వేల ఆదాయం వస్తే ప్రస్తుతం నెలకు 2 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని అన్నారు. పార్క్ వద్ద సోలార్ పార్కింగ్ ఏర్పాటు చేశామని, యోగా షెడ్ వద్ద కూడా రూఫ్ పై సోలార్ ప్యానేల్ ఏర్పాటు చేశామని అన్నారు. పార్క్ వద్ద ప్లాస్టిక్ వాడకం నివారణ ప్రాధాన్యతగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పూనుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, శిక్షణ ఐపీఎస్ రుత్విక్ సాయి, డిఆర్డీవో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా సుమేష్ యాదవ్

**కూసుమంచి, జనవరి 17, మహా:** తెలంగాణా బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామానికి చెందిన ఏళ్ళబోయిన సుమేష్ యాదవ్ ను ఎంపిక చేస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భారత్ నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నియామక పత్రాన్ని భారత్ సుమేష్ యాదవ్ కు అందజేశారు. ఈ సందర్భంగా నాయిని భారత్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి అందించాల్సిన సంక్షేమ ఫలాల కోసం బీసీ సంక్షేమ సంఘం అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో, దేశంలో బీసీల అధికారమే లక్ష్యంగా మునుముందు మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రకారం గా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సుమేష్ యాదవ్ ను అభినందించారు. అధ్యక్షుడు సుమేష్ యాదవ్ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన నాయిని భారత్ కు కృతజ్ఞతలు చెప్పారు. జిల్లాలో బీసీల అందరిని ఐక్యం చేసుకొని బీసీల సంక్షేమానికి ఉద్యమిస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టిన భారత్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా బీసీల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు పోతానన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం సంభయ్య, ఖమ్మం జిల్లా బీసీ నాయకులు గడ్డం నరేష్ కుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

## వేంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా రమేష్



**నేలకొండపల్లి, జనవరి 17 మహా:** స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ గా నేలకొండపల్లి కి చెందిన కనమర్లపూడి రమేష్ ను నియమించారు. అదే విధంగా పాలకవర్గ సభ్యులు గా మల్లయ్య, కోటేశ్వరీ, సత్యనారాయణ, రాంబాబు, పి.సత్యం లు శనివారం దేవాలయం లో ప్రమాణాస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమం కు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్రెడ్డి తో పాటు, దేవాదాయ శాఖ అధికారులు హజరు కానున్నారు.

# ధూళి పొరల కింద ఖమ్మం

## పర్యావరణానికి ప్రమాదకరమైన గ్రానైట్ ట్రాఫిక్

- ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్న గ్రానైట్ ధూళి
- గ్రామీణ ప్రాంతాల్లో పంటల దిగుబడిపై దెబ్బ
- వాహనాల వేగం నియంత్రణకు నిఘా అవసరం
- టార్పాలిన్ కవర్లు తప్పనిసరి అంటున్న ప్రజలు







**ఖమ్మం అర్బన్ , జనవరి 17, మహా:** ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమలు భారీ స్థాయిలో అభివృద్ధి చెందుతుండటం ఓ వైపు సమృద్ధి సూచిస్తుండగా, మరో వైపు ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతకు ముప్పుగా మారుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజుకు వేల సంఖ్యలో గ్రానైట్ వేస్టేజ్ తరలింపునకు లారీలు, ట్రాక్టర్లు రహదారులపై తిరుగుతుండటం ధూళి సమస్యను తీవ్రమయ్యేలా చేస్తోంది. పట్టణాల ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాలు ఈ ధూళి ప్రభావంతో తీవ్రంగా నష్టపోతున్నాయి. ధూళి కారణంగా గాలి కాలుష్యం విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. ఆస్తమా, అలర్జీ వంటి సమస్యలు అధికమవుతున్నాయి. రహదారుల వెంట నివసించే కుటుంబాలు రోజువారీ జీవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు స్కూలు వెళ్లే సమయంలో రోడ్డు దాటేందుకు భయపడుతున్నారు. వ్యాపార ప్రాంతాల్లో ధూళి పేరుకుపోవడంతో వ్యాపారులు ఆర్థిక నష్టాలు అనుభవిస్తున్నారు. గ్రానైట్ వేస్టేజ్ తరలింపులో వాహన యజమానులు సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. టార్పాలిన్ కవర్లు లేకుండా ధూళిని వదిలి వెళ్తుండటం వాహనదారులకు, పాదచారులకు ప్రమాదాలను పెంచుతోంది. ద్విచక్ర వాహనదారులు ముందు వెళ్తున్న లారీల నుంచి వస్తున్న ధూళిలో నడవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. రైతుల పంటలపై ఈ ధూళి ప్రభావం చూపడంతో పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. టార్పాలిన్ కవర్లను తప్పనిసరి చేయడం, రహదారులపై ప్రతిరోజూ నీటిని పిచికారీ చేయడం వంటి చర్యలను చేపట్టాల్సిన అవసరం ఉంది. వాహనాల వేగం నియంత్రణకు సీసీటీవీల ద్వారా పర్యవేక్షణ అవసరం. లారీలు, ట్రాక్టర్లు తిరిగే రూట్లను పట్టణాలకు దూరంగా ఏర్పాటు చేయడం ప్రజల భద్రత కోసం కీలకంగా మారింది. ఖమ్మం జిల్లా గ్రానైట్ పరిశ్రమలతో ప్రసిద్ధి చెందింది. జిల్లాలో 450 గ్రానైట్ పరిశ్రమలతో పాటు 1250 అనుబంధ ఫ్యాక్టరీలు జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ పరిశ్రమల వల్ల ఏర్పడే గ్రానైట్ వేస్టేజ్ ను తరలించేందుకు 2000 పైగా ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలు వినియోగిస్తున్నారు. వీటి వల్ల రహదారులపైనే కాకుండా పర్యావరణంపైనూ ప్రతికూల ప్రభావం పడుతోంది.ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రజల డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతను కాపాడే విధంగా కార్యాచరణను ప్రణాళికబద్ధంగా అమలు చేయడం అత్యవసరం.

# శక్తివంతమైన ఉద్యమాలకు, రైతులు సిద్ధం కావాలి

## దొండపాటి రమేష్

**కొణిజర్ల, జనవరి 17, మహా:** కార్పొరేట్ శక్తులు నుండి వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు శక్తివంతమైన ఉద్యమాలకు రైతులు సమయత్వం కావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాడు రమేష్ పిలుపునిచ్చారు శుక్రవారం రాందాస్, అధ్యక్షతన జరిగిన బోడియ తండ రైతు సంఘం శాఖ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు 75% శాతం వ్యవసాయ రంగం మీద ఆధారపడి ఉన్న దేశంలో పరిపాలించే పరిపాలకులు వ్యవసాయ రంగానికి 50 శాతం నిధులు కేటాయించడంలో పక్షపాతం చూపించడం వల్ల వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నది అని వారు ఆరోపించారు ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని కాపాడకపోతే దేశంలో ఆహార ఉత్పత్తులు తగ్గే ప్రమాదం ఉందని వారు తెలిపారు రైతులను రాజకీయాల చుట్టూ తిప్పుకుంటూ అధికారాల కోసం ఆర్భాటాలు తప్ప రైతులకు పాలకులు వరగబెట్టిందేమీ లేదని వారు రైతు సమస్యల కోసం నిరంతరం పోరాడే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాన్ని గ్రామ గ్రామాన బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు తనికెళ్ళ రెవిన్యూ పరిధిలో ఉన్న బోడతండ గ్రామానికి చెందిన వీధుల చెరువును బోడియా తండ గ్రామపంచాయతీ పరిధిలోకి తీసుకోవాలని పంట పొలాల పోయే రహదారులు అభివృద్ధి చేయాలని సాగర్ జలాలతో వీధులు జరుగును నింపుటకు ప్రత్యేక తూము ఏర్పాటు చేయాలని హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ మహాసభలో వడిత వీరన్న ధరావత్ రవి బానోతు వెంకన్న జర్పుల భీమ్లా హనుమ తేజావత్ రవి తావు రాందాస్ తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం బోడియ తండా గ్రామ అధ్యక్షుడిగా ధరావత్ రవి ప్రధాన కార్యదర్శిగా వడిత్యా విరన్న తోపాటు తొమ్మిది మంది కమిటీ సభ్యులను మహాసభ ఎన్నుకున్నది





# వ్యవసాయేతర భూములను పరిశీలించిన జేడీఏ

**పాలేరు, జనవరి 17,మహా:** కూసుమంచి మండలంలోని గట్టుసింగారం, పెరికసింగారం గ్రామాలలో రైతు భరోసా సర్వేను జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రైతు భరోసా సర్వేలో వ్యవసాయం చేయడానికి యోగ్యం కాని భూములను వ్యవసాయ, రెవెన్యూ శాఖల ద్వారా సర్వే జరుగుతుందని తెలియజేశారు. ఈ సర్వే శనివారం వరకు కొనసాగుతుందని తెలియజేశారు. సర్వే అనంతరం సోమ మంగళవారాలలో గ్రామసభలు జరుగుతాయని తెలియజేశారు. అనంతరం గట్టుసింగారం గ్రామంలోని వరి, మిర్చి మొదలగు పంటలను సందర్శించారు. వరిలో అక్కడక్కడ ఆకు చుట్టు పురుగును గమనించడం జరిగిందని దీని నివారణకు క్లోరోపైరిఫోస్ , ఎసిఫేట్ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ వంటి పురుగు మందులను పిచికారి చేయడం వల్ల పురుగు ఉధృతిని అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి సరిత, తాసిల్దార్ కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు వంశీకృష్ణ రవితేజ మరియు రైతులు పాల్గొన్నారు.

# రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

- ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు
- గూడూరు పాడు ఎఐకెఎస్ నూతన కమిటీ ఎన్నిక



**ఖమ్మంరూరల్ , జనవరి 17, మహా:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకై ప్రభుత్వాలపై పోరాడేందుకు రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరావు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం గూడూరు పాడు గ్రామంలో ని సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) శాఖా మహాసభను బండి అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటుచేసిన ఏఐకేఎస్ జెండాను సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గోవిందరావు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 75 శాతం వ్యవసాయ రంగం ఉన్నప్పటికీ బడ్జెట్లో 50 శాతం నిధులు కేటాయించడం రైతులను విస్మరించడమే అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వ్యవసాయ రంగం కుదేలవుతూ వస్తుందని ఆరోపించారు. కేవలం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుండటంతో ఆ భారం వ్యవసాయ రంగంపై పడి ఆహార ఉత్పత్తులు తగ్గే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం గూడూరు పాడు (ఏఐకేఎస్) నూతన గ్రామ శాఖను



ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎర్రబోయిన వెంకట నరసయ్య, ఉపాధ్యక్షులుగా పోడేటి భాస్కర్, బండి ఉపేందర్ ,కార్యదర్శిగా బండి రమణ ,సహాయ కార్యదర్శులుగా వడ్డేపూడి వెంకటేశ్వర్లు, మారుతి నరేష్, ట్రెజరీగా పుచ్చకాయల రాంబాబు, సభ్యులుగా కర్ణం పెద్ద ఉపేందర్ ,బండి వెంకటయ్య ,ఎర్రబోయిన వెంకట నారాయణ, కొలిచలం వీరయ్య, సావిడి గంగయ్య, బండి రాంబాబు, మారుతి వెంకన్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణ కుమార్, ఏఐకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బానోతు రామకోటి, పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ ఎడ్లపల్లి శంకరయ్య, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏలూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు

**30 కోట్లతో ఖమ్మం ఖిల్లా రోప్ వే పనులు.. దశల వారీగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**







**ఖమ్మం, జనవరి 17:మహా:** ఖమ్మం నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ బల్లేపల్లి జయనగర్ కాలనీలో ఎల్.ఆర్.ఎస్. నిధులు 2 కోట్లతో చేపట్టిన సైడ్ డ్రైన్ నిర్మాణం, ఖమ్మం ఇల్లందు ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఎస్సి కాలని చర్చి వరకు జయనగర్ కాలనిలో రోడ్డు పురోగతి పనులు, టి.యు.ఎఫ్.ఐ.డి.సి.నిధులు ఒక కోటి 25 లక్షలతో 3 వ డివిజన్ నందు సి.సి.రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో దివంగత కార్పొరేటర్ జగన్ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన డివిజన్ లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ఖానాపురం, బల్లెపల్లి, బాలాపేట్ నుంచి ఖమ్మం పట్టణంలో వచ్చిన వరద నివారణకు 200 కోట్లతో సర్ ప్లస్ నీరు ధంసలాపురం మీదుగా మళ్ళీ మున్నేరు వెళ్ళే విధంగా కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. ఖమ్మం ఖిల్లా, వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి చర్యలు ప్రణాళికలు చేపట్టామని, ఈ రోజు వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు 3 కోట్లు మంజూరు చేశామని అన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్ వే ద్వారా సందర్శకులు వెళ్లేందుకు, పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు 30 కోట్లతో పనులు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనవరి 26 నుంచి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాలను ప్రారంభిస్తామని అన్నారు. మొదటి దశలో అత్యంత పేదలకు ప్రభుత్వ సహాయం అందుతుందని, తరువాత దశలవారీగా అర్హులందరికీ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామని, ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉగాది నుండి రేషన్ కార్డుల క్రింద సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం మన జిల్లాలో లక్ష టన్నులు అధికంగా ధాన్యం సేకరణ జరిగిందని అన్నారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ అందించామని అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నూతన వైద్య కళాశాల జిల్లాకు రావడంతో పాటు జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే మన పి.హెచ్.సి. లు, ఏరియా ఆసుపత్రిలను మంత్రి చొరవ వల్ల అభివృద్ధి చేసుకుంటూ పోతున్నామని అన్నారు. విద్యా రంగంలో మన పిల్లలు అద్భుతంగా ఎదగాలనే ఆకాంక్షతో జిల్లాలో 60 ఉన్నత పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు ప్రవేశ పెట్టామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన మౌళిక వసతులు కల్పించుకుంటూ పోతున్నామని అన్నారు. జిల్లాలో 575 కోట్ల రూపాయలతో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 160 కోట్ల బోనస్ ఇచ్చామని అన్నారు. భక్త రామదాసు, నాగార్జున సాగర్, ఇతర ఎత్తిపోతల పథకాల క్రింద సాగు సజావుగా అందేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఆర్ అండ్ బి ఇఇ యుగంధర రావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# గడువు ఫిబ్రవరి నెలాఖరు

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం, జనవరి 17, మహా:** వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు ఫిబ్రవరి నెలాఖరుకు గ్రౌండింగ్ అయ్యేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం అటవీ శాఖ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి పనుల కార్యాచరణ పై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వైరా హైవే రోడ్ నుండి వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత భూ యజమానులతో సంధి చర్చలు జరిపి భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. రోడ్డు నిర్మాణంతో భూ ధరలు పెరిగి, యజమానులు లాభపడతారన్నారు. అర్బన్ పార్క్ వెనుక భాగం ఫెన్సింగ్ చేపట్టాలన్నారు. సరిహద్దు వివాదాల వద్ద జాయింట్ సర్వే చేపట్టే, సమస్యలు పరిష్కరించాలన్నారు.

హైవే రోడ్ పై అర్బన్ పార్క్ వెళ్లే చోట మంచి ఆకర్షణీయమైన ఆర్చ్ ఏర్పాటుచేసి, బస్ స్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అర్బన్ పార్క్ కు మినీ బస్ లు నడిపేలా కార్యాచరణ చేయాలన్నారు.

అర్బన్ పార్క్ వద్ద పార్కింగ్ కు ఏర్పాట్లు చేయాలన్నారు. బయటి తినుబండారాలకు అనుమతి ఇవ్వవద్దని, పార్క్ లోపలి క్యాంటీన్ పదార్థాలను మాత్రమే అనుమతించాలని అన్నారు. క్యాంటీన్ ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని, బయో వస్తువులు మాత్రమే వాడేలా చూడాలన్నారు. వాటర్ పాయింట్స్, డస్ట్ బిన్ లు అవసరం మేరకు ఏర్పాటు చేయాలన్నారు. నామ సూచికలు ఆకర్షణీయంగా ప్రదర్శించాలన్నారు.

వాకింగ్ ట్రాక్ అధునికీకరించి, వాకింగ్ క్లబ్ లతో మాట్లాడి, వాకింగ్ ట్రాక్ సద్వినియోగం చేసుకునేలా, వాకర్స్ ప్రకృతితో మమేకమై మరింత ప్రయోజనం పొందేలా చూడాలన్నారు. పిల్లలకు ప్లే జోన్, యువతకు అడ్వాంచర్ పార్క్, యోగా, వాకింగ్ ట్రాక్ ఇలా అన్ని వయసుల వారు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్క్ చుట్టూ పెట్రోలింగ్ చేపట్టాలని, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు.

ఈ సమీక్షలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎఫ్డివో మంజుల, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, ఇర్రిగేషన్ ఇఇ రామకృష్ణ, డిఇ రాంప్రసాద్, ఎఫ్ఆర్వో నాగేశ్వరరావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మగౌరవయాత్రను విజయవంతం చేయండి

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె వి కృష్ణారావు



**ఖమ్మం సిటి, జనవరి 17, మహా:** ఈనెల 19న శనివారం మానుకోట పట్టణంలో అనంతరం నుండి అమరవీరుల స్తూపం వరకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవయాత్రకు తెలంగాణ ఉద్యమకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణఉద్యమకారులఫోరంరాష్ట్రస్టీరింగ్కమిటీ చైర్మన్ డాక్టర్ కె వి కృష్ణారావు పిలుపు ఇచ్చారు. ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు . కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని మరియు గృహాన్ని నిర్మించుకునేందుకు 10 లక్ష రూపాయలు సహాయం చేస్తానని ప్రకటించింది . 6 గ్యారంటీల పథకంలో 6వ గ్యారంటీగా ఈ అంశాన్ని పొందుపరిచింది . మిగతా 5 గ్యారంటీల పథకాలను అమలు చేస్తూ ఆ అంశాలను పత్రికా ముఖంగా సమావేశలలో చెప్పడం జరుగుతుంది . 6వ గ్యారంటీ అయిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీని మాత్రం ఎక్కడా కూడా ఏ ప్రజా ప్రతినిధి కూడా ప్రస్తావించడం లేదు ఎందుకని ? తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వానికి ఏమీ అన్యాయం చేశారు . గత ప్రభుత్వం కూడా ఉద్యమకారులను పూర్తిగా విస్మరించింది . అప్పుడు ఉద్యమకారులందరూ తమ బలాన్ని గడిచిన ఎన్నికలలో గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి ప్రభుత్వాన్ని గద్దెదించారు . సోనియా గాంధీ మీద మాకు అపారమైన గౌరవం ఉంది . ఇకనైనా సోనియా గాంధీ చొరవతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని మాకు నమ్మకం ఉంది . ఇప్పటికైనా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకాల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య , పగడాల నరేందర్ , రాష్ట్ర కార్యదర్శి రాచమల్ల ఉమా యాదవ్ , ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా కన్వీనర్ రెడ్డబోయిన వరలక్ష్మి , లింగనబోయిన సతీష్ , బట్టు రాజేంద్ర నాయక్ , బెల్లంకొండ నాగేశ్వరావు , బాలిని భాస్కర్ రెడ్డి , కామని అనంతలక్ష్మి , స్వరూప రెడ్డి , ధనలక్ష్మి , జయ , పద్మ తదితరులు పాల్గొన్నారు .

### క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ కొరకు
# జనవరి 25లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవిబాబు.

**ఖమ్మం, జనవరి 17, మహా:** ఇంటర్మీడియట్ ఎం.ఎల్.టి. ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం ఏరియా ఆసుపత్రులలో అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు ఒక వేయి రూపాయలు డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు శుక్రవారం తెలిపారు.

ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జనవరి 25లోగా అందజేయాలని రవిబాబు పేర్కొన్నారు.


# సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి



కామేపల్లి జనవరి 17 (మహా ) న్యూస్: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎం వి మధుసూదన్ తాసిల్దార్ సుధాకర్ లు అన్నారు శుక్రవారం మండల పరిధిలోని పింజరమడుగు గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఎంపిక కొరకు పిసా గ్రామ సభ నిర్వహించారు ఈ గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీచట్టాలను చిత్త పరిధిలో గ్రామ సభ నిర్వహించడం జరిగిందని ప్రజల సమగ్ర నిర్ణయం మేరకే లబ్ధిదారులు ఎంపిక జరుగుతుందని తెలిపారు పంచుకోవాలని సూచించారు రాబోవు రోజుల్లో కూడా సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల పై గ్రామ సభల ద్వారానే నిర్వహణ పనులు గుర్తింపు ఉంటుందని కోరారు అధికారి యంత్రం ప్రజలను దృష్టిలో ఉంచుకొని వారి నిర్ణయం



మీరగే పనిచేస్తుందని తెలిపారు అనంతరం గ్రామ పీసా కోఆర్డినేటర్ అశోక్ గ్రామ సభ నిర్వహణ పిజ్జా చట్టం గురించి వర్ణించారు ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి రెవిన్యూ ఇన్స్పెక్టర్ సక్రు గ్రామ పంచాయతీ అధికారి గోపిక గ్రామస్తులు దమ్మలపాటి సత్యనారాయణ ఇంజం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు


Library compound wall

# ఖమ్మం సిటీ బ్యూటిఫికేషన్ కృషి

**ఖమ్మం సిటి, జనవరి 17, మహా:** ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్య ఆదేశాలపై హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధిక నేతృత్వంలో సిటీ బ్యూటిఫికేషన్ కార్యక్రమం నిర్వహించబడింది. బ్యాంక్ కాలనీ కరెంట్ ఆఫీస్ లైన్ వాల్, రాపర్తి నగర ఫ్లైఓవర్, మినిస్టర్స్ క్యాంప్ ఆఫీస్ రోడ్డు వాల్ వంటి ప్రదేశాల్లో పెయింటింగ్ వేయించడం జరిగింది. ఈ పెయింటింగ్స్ పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబించేలా రూపొందించబడ్డాయి. నగరంలోని ప్రధాన ప్రదేశాలను అందంగా మార్చేందుకు చేపట్టిన ఈ చర్యలకు పలు వర్గాల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

## కొనసాగుతున్న రైతు భరోసా సర్వే ప్రక్రియ



**బోనకల్, జనవరి 17,మహా:** రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది.ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో నిధులు జమచేయాలని ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది. గురువారం నుంచి 20వ తేదీ వరకు వ్యవసాయ భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కూడిన బృందాలు సాగుకు యోగ్యంగా లేని భూములు,కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్న భూముల యొక్క వివరాలను శుక్రవారం మండల పరిధిలోని రావినూతల గ్రామంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ గూగులోత్ లక్ష్మణ్ వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి హనుమంతరావు, సర్వేయర్ సత్యనారాయణ రెవిన్యూ సిబ్బందితో కలిసి భూములను గుర్తించడం జరిగింది. వాటిని రైతు భరోసా సాయాన్ని పొందే జాబితా నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులకు పంపనట్లు తెలిపారు.

## శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలనా దక్షత నేటికీ ఆదర్శం



**ఖమ్మం సిటి, జనవరి 17, మహా:** తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణ దేవరాయలు అని,ఆయన పరిపాలనా దక్షత నేటికీ ఆదర్శనీయమని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ కొనియాడారు.శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా మున్నూరుకాపు సంక్షేమ సంఘం అడహక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు .ఈ కార్యక్రమానికి కృష్ణ అతిధి గా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి కి ఎన లేని సేవ చేసిన వ్యక్తి శ్రీ కృష్ణ దేవరాయలు అని పేర్కొన్నారు.ఆయన పరిపాలనా దక్షుడని తెలిపారు. రాయల వారి పరిపాలనా ఆదర్శ నీయమని వెల్లడించారు.రాయల వారి పెద్ద విగ్రహాన్ని ఖమ్మం లో ఏర్పాటు చేయాలి అని కోరారు. ఆయన స్ఫూర్తి తో మున్నూరు కాపులు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు నాయకులు కొత్తా సీతారాములు ,శ్రీ హరి ,నాసరయ్య, నరేందర్ రాపర్తి రాజా,మాటేటి రవి , నరేష్ మోహన్ నాయుడు,జీవీవీఎల్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

### ఆన్లైన్ నమోదు ప్రక్రియ కూడ పూర్తి చేయాలి

### ఖమ్మం ఆర్డీవో నరసింహారావు



**నేలకొండపల్లి, జనవరి 17 మహా:** సంక్షేమ పథకాల పై చేపట్టిన సర్వే ను సకాలంలో పూర్తి చేయాలని ఖమ్మం ఆర్డీవో జీ. నరసింహారావు ఆదేశించారు. మండలం లోని గువ్వలగూడెం, మోటాపురం, రాజేశ్వరపురం గ్రామాలలో జరుగుతున్న సర్వే ను శుక్రవారం పరిశీలించారు. ఇంటింటా తిరిగి సర్వే తీరు ను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పొలాల వద్దకు వెళ్లారు. అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ పొలాలను పరిశీలించారు. వీటిని ఎలా నమోదు చేస్తున్నారని సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. పలు గ్రామాలలో రేషన్ కార్డులు అర్హత ఉన్న వారికి కూడ రాలేదని..పలుమార్లు ధరఖాస్తులు చేసుకున్నామని ఆర్డీవో వద్ద సమస్య ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.....సర్వే ను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ను పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే పూర్తి చేసిన అనంతరం వాటిని ఆన్లైన్ నమోదు ప్రక్రియ కూడ శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సర్వే అనంతరం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ జె. మాణిక్యరావు ,ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, వ్యవసాయాధికారి యం.రాధ, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ లు ఆలస్యం మధుసూధన్రావు, బీ.రవి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**బోనకల్, జనవరి 17, మహా:** మండల పరిధిలోని గోవిందాపురం(ఏ)గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీటీ రోడ్ నిర్మాణ పనులు శుక్రవారంతో పూర్తి అవడం జరిగింది. గోవిందాపురం ఏ గ్రామం నుంచి ఆంధ్ర ప్రాంత సరిహద్దు ఐనా కేఎర్రావు బిటి రోడ్డు వరకు పూర్తయిన రోడ్డు నిర్మాణ పనులను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామశాఖ అధ్యక్షులు భాగం పాపారావు మండల నాయకులు భాగం నాగేశ్వరరావు పంచాయతీరాజ్ అధికారులు డిఈ కోటేశ్వరరావు,ఏఈ నవీన్ లు పరిశీలించారు. పనులు త్వరితగర్తన పూర్తి చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భాగం నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఏడు కోట్ల రూపాయల నిధులు గోవిందాపురం ఏ గ్రామానికి కేటాయించి రోడ్డు మార్గాలను త్వరితగతిన పూర్తి చేయడం పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టికి గ్రామం తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.



# శ్రీ కృష్ణప్రసాద్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ఖమ్మం సిటి, జనవరి 17, మహా:** పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించే లక్ష్యంతో కొనసాగుతున్న శ్రీ కృష్ణ ప్రసాద్ పోలీస్ సంక్షేమ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చిన వర్చసా ఫౌండేషన్ టీమ్ లీడర్స్ కృష్ణ ఏదుల, శ్రీనివాస్ సుబ్బారావు, అవిజిత్ శర్మ, అరుణ తో కలసి స్కూల్ చైర్ పర్సన్ నిష్టాశర్మ భవనం నిర్మాణానికి శుక్రవారం స్కూల్ ఆవరణలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ హాజరై శంకుస్థాపనలో పాల్గొన్నారు. ప్రైమరీ విద్యార్థుల తరగతుల భవనం శిధిలావస్థలో వుండటంతో సామజిక సేవలో భాగంగా స్కూల్ చైర్ పర్సన్ నిష్టా శర్మ చొరవతో విర్చూసా ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఈ నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు విర్చూసా ఫౌండేషన్ తెలిపింది. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, టిఫిన్ బాక్స్ లు అందజేశారు.

కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, సుశీల్ సింగ్, ఆర్ ఐ కామరాజు, సురేష్, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# సింగరేణి నా చావుకు కారణం

## సెల్ఫీ వీడియోలో వాపోయిన మృతుడు

- శైలో బంకర్ వల్లన తమ జీవితాలు అర్ధాంతరంగా ముగిస్తున్నాయంటూ ఆరోపించిన మృతుడు
- సింగరేణి నుండి వెలువడుతున్న దుమ్ముతో ప్రాణాలు కోల్పోతున్న అంబేద్కర్ నగర్ వాసులు







**సత్తుపల్లి, జనవరి 17: మహా:** అభివృద్ధి చేస్తామంటూ, అడుగుపెట్టిన సింగరేణి అభివృద్ధి మాటలు పక్కనపెట్టి ఆయువులు తీస్తుంది. వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో నివసిస్తున్న బుర్ర తుకారం (రవీంద్ర) 38సం" గుండె, లివర్, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ తో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచాడు. మృతుడు తుకారాం అలియాస్ రవీంద్ర మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర రాజధానిలోని గాంధీ హాస్పిటల్ లో చేరడానికి ముందు తీసుకున్న సెల్ఫీ వీడియో ఇప్పుడు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేయడమే కాకుండా, మనసున్న ప్రతి ఒక్కరిని ప్రశ్నించమని కోరుతుంది. తన చావుకు పూర్తి బాధ్యత తమ కాలనీ ముందు సింగరేణి సంస్థ నిర్మించిన సైలో బంకర్ నుండి వెలువడే దుమారమేనని, సైలో బంకర్ ను అక్కడ నుంచి తొలగించి తమ కాలనీవాసులకు అధికారులు న్యాయం చేయాలని వేడుకోవడం ప్రతి ఒక్కరి మనసులను కలచి వేస్తుంది. మా కాలనీని మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలని , ప్రాణాలు కోల్పోకుండా కాపాడాలంటూ మాట్లాడిన మాటలు వింటున్న కాలనీవాసులు కంటతడి పెడుతున్నారు. మృతుడు తుకారాంకు అంగవైకల్యం కలిగిన భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. చిన్న వయసులోనే తండ్రిని దూరం చేసుకున్న చిన్నారులు, బంగారు భవిష్యత్తు ఉన్న భర్త అర్ధాంతరంగా తనువు చాలించడంతో దివ్యాంగురారైన భార్య పరిస్థితి ఏమిటనేది ఇప్పుడు ప్రశ్నార్ధకంగా మారింది. అంబేద్కర్ నగర్ కాలనీలో వందల మరణాలు సైలో బంకర్ వల్లన కలుగుతున్నా సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల ప్రాణాలు పిట్టల్లా రాలుతున్న అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం, అభివృద్ధి పేరుతో అడుగుపెట్టి కోట్లు కూడా పెట్టుకుంటున్న సింగరేణి మృతి చెందిన కుటుంబాలకు కనీసం నష్టపరిహారం కూడా చెల్లించకపోవడం వారి యొక్క గర్వానికి నిదర్శనంగా కనిపిస్తుంది. నల్ల బంగారం తీస్తామంటూ వచ్చిన సింగరేణి తమ కుటుంబాల్లో ప్రాణాలు తీస్తుందని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు అంబేద్కర్ కాలనీవాసులకు పునరావాసం కల్పించి చనిపోయిన మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలని మృతదేహంతో హైవే రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. సింగరేణి యాజమాన్యం నశించాలి అని తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని నినాదాలతో రాస్తారోకో నిర్వహించారు. తక్షణమే సింగరేణి యాజమాన్యం,ప్రభుత్వం కల్పించుకొని శైలో బంకర్ ను తమ కాలనీకి దూరంగా నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు.

# సంజయ్ కుటుంబానికి పరామర్శ, ఆర్థిక సాయం



**ఖమ్మం రూరల్, జనవరి 17, మహా:** అనుమానస్పద స్థితిలో మృతి చెందిన పందెపు సంజయ్ కుటుంబాన్ని మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, మండల కాంగ్రెస్ నాయకులు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లో గల నివాసం వద్దకు వెళ్లి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.పదివేల ను మృతుడి తండ్రికి అందజేసి ఓదార్చారు. అధైర్య పడవద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అండగా నిలుస్తామని మనోధైర్యాన్ని కల్పించారు. అలాగే మృతి పై సమగ్ర విచారణ జరిపించి నిందితులపై కఠినంగా శిక్షించాలని పోలీస్ వారికి విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, భూక్య సురేష్ నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు బానోతు హరి నాయక్, శేశిరెడ్డి ,నాగేష్ ,గోరేమియా ,శ్రీను ,చంద్రశేఖర్ ,మహేష్ ,రవి, నరేష్ ,గణేష్, సత్తార్, పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బానోతు కిరణ్, యువ నాయకుడు ఏనుగు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి భవన్ అధ్యక్షుడు గా సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నిక

**నేలకొండపల్లి, జనవరి 17 మహా:** స్థానిక వాసవి భవన్ అధ్యక్షుడు గా మాటూరి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం వాసవి భవన్ అధ్యక్ష పదవి కి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో మాటూరి సుబ్రహ్మణ్యం సింగిల్ నామినేషన్ వేయటంతో ఎన్నికల అధికారులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు గెల్లా జగన్మోహన్రావు, వంగవీటి నాగేశ్వరరావు, రేగూరి హనుమంతరావు, కొత్త రమేష్, దోసపాటి చంద్రశేఖర్ లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడారు...వాసవి భవన్ ఆధునీకీకరణ. ను త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. తన పై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సమర్ధవంతంగా ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని అన్నారు. అధ్యక్షుడు ను డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, యర్రా నాగేశ్వరరావు, దేవరశెట్టి లక్ష్మణరావు, వెంకటరమణ గుప్తా, గెల్లా వాసు, సుబ్బయ్య, ఈగ అనిల్, దోసపాటి అచ్యుత్అ మయ్య, యుగంధర్ ఘనంగా సన్మానించారు.



# ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఖమ్మం జిల్లా అగ్రగామి

**ఖమ్మం, జనవరి 17, మహా:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ఆదర్శంగా నిలిచింది. జిల్లాలో మొత్తం 3,57,869 దరఖాస్తులు నమోదవగా, 3,55,054 దరఖాస్తుల సర్వే పూర్తయింది. అధికారుల సక్రమ సమన్వయం, సర్వేయర్ల కృషి ఈ విజయానికి కారణమని అధికారులు తెలిపారు.




**ఖమ్మం నియోజకవర్గం**

ఖమ్మం నగరపాలక సంస్థతో పాటు గ్రామీణ ప్రాంతాలు కలిపి మొత్తం 70,323 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. వీటిలో 67,931 దరఖాస్తుల సర్వే పూర్తవగా, 2,391 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 96.60 శాతం విజయశాతం నమోదైంది.

**పాలేరు నియోజకవర్గం**

పాలేరు నియోజకవర్గం 70,915 దరఖాస్తులతో ముందు నిలిచింది. వీటిలో 70,873 దరఖాస్తుల సర్వే పూర్తయింది. 42 పెండింగ్ దరఖాస్తులు మాత్రమే మిగిలి ఉండగా, 99.94 శాతం విజయశాతం సాధించింది.

**మధిర నియోజకవర్గం**

మధిర నియోజకవర్గం సర్వే ప్రక్రియలో తన ప్రత్యేకతను చాటింది. 69,917 దరఖాస్తుల్లో 69,707 దరఖాస్తుల సర్వే పూర్తవగా, 99.70 శాతం విజయంతో నిలిచింది.

**వైరా నియోజకవర్గం**

వైరా నియోజకవర్గం అత్యధిక విజయశాతం సాధించిన ప్రాంతంగా నిలిచింది. 68,582 దరఖాస్తులలో 68,564 దరఖాస్తుల సర్వే పూర్తవగా, 99.97 శాతం విజయాన్ని నమోదు చేసుకుంది.

**సత్తుపల్లి నియోజకవర్గం**

సత్తుపల్లి నియోజకవర్గం 78,132 దరఖాస్తులలో 77,979 దరఖాస్తుల సర్వే పూర్తయింది. 99.80 శాతం విజయంతో అత్యుత్తమ స్థానంలో నిలిచింది. ఖమ్మం జిల్లా మొత్తం 99.21 శాతం విజయశాతం సాధించడం గర్వకారణమని అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 2,815 దరఖాస్తులపై త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వం, అధికారుల కృషి ఇతర జిల్లాలకు ఆదర్శమని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# రాయల కు ఘన సన్మానం



**నేలకొండపల్లి, జనవరి 17 మహా:** విదేశీ పర్యటన ను ముగించుకుని స్వగ్రామం కు వచ్చిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ను ఘనంగా సన్మానించారు. అమెరిక పర్యటన ను ముగించుకుని శుక్రవారం ఖమ్మం వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులు పలువురు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, సేవాదళ్ పాలేరు కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, బీసీ సెల్ ఉపాధ్యాక్షుడు బోయిన వేణు. యూత్ కాంగ్రెస్ పాలేరు డివిజన్ ఉపాధ్యాక్షుడు గట్టికుండ్ల విజయ్, భూక్యా చిన్న నాయక్, సాయిన వీన్, గట్టికుండ్ల వెంకటేశ్వర్లు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కార్పోరేటర్లతో మాజీ మంత్రి పువ్వాడ సమావేశం

### మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా కర్నాటి కృష్ణ, షేక్ మక్బూల్ ఏకగ్రీవ ఎన్నిక




**ఖమ్మం, జనవరి 17, మహా:** ఖమ్మం నగర బిఆర్ఎస్ కార్పోరేటర్లతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, ఖమ్మం మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ గా కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా షేక్ మక్బూల్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడినట్లు ప్రకటించడమైనది. ఈ సందర్భంగా మాట్లాడిన పువ్వాడ అజయ్ కుమార్, కార్పోరేటర్లను అభినందిస్తూ, బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులుగా ఉన్నప్పటికీ, వారు ప్రజా సమస్యలపై పోరాడాలని, నగర అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఆయన అన్నారు, "ప్రతిపక్ష పాత్ర పోషించుకుని, నగర అభివృద్ధికి కృషి చేయాలి. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని, పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి. మీకు ఏ సమస్య వచ్చినా, నేను అందుబాటులో ఉంటాను. ఎవరి బెదిరింపులకు భయపడకుండా, ధైర్యంగా ఉండాలి." మాజీ మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, "ఐదు వారాల గడిచినా, ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుపరచని ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి, మోసం చేస్తూ అధికారం అనుభవిస్తూ, ఎంజాయ్ చేస్తుంది" అని పేర్కొన్నారు. ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ మాట్లాడుతూ, "నగర అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం వల్ల, శానిటేషన్, వీధి లైట్లు, నగర శుభ్రతలో లేనిపోని సమస్యలు ఉన్నాయి. మంత్రులు రివ్యూ మీటింగ్స్ పెట్టడం తప్ప, అమలుకు దారి తీయడంలో పూర్తిగా విఫలమయ్యారు. వృద్ధి నిధులు ఇప్పటికీ కేటాయించలేదు" అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఇతర కార్పోరేటర్లు కూడా పాల్గొన్నారు.



# ఐకెపి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన




**ముదిగొండ జనవరి 17(మహా న్యూస్ ):** మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలపై ఐకెపి ఆధ్వర్యంలో పొదుపు (డ్వాక్రా) సంఘాల మహిళలు, గ్రామ ప్రజలుకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఐకేపీ సీసీ ఆంబాల హరికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయలోపం, ప్రచారలోపం ఉండకూడదని చెప్పారు. ఈపథకాలు,ప్రజలకు చాలా మేలు చేస్తాయని నిర్వాసితులకు సంబంధించి పథకాల వర్తింపుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా గొప్ప పథకమని,ఆపథకం అందని వారు నిరాశ చెందకుండా వారిని ఉపాధి హామీ పనులకు వెళ్లి మరోసారి దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించారు.ఈసమావేశంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ దేగల సురేష్,విఓఏ కొట్టె సుభాషిని,గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కోరుట్ల పద్మ,కార్యదర్శి కుంచాల ఉమ,కోశాధికారి కన్నోజు అమరావతి ఫీల్డ్ అసిస్టెంట్ గోపి స్వరూపరాణి,డ్వాక్రా సంఘాల మహిళలు ,గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బ్యాంకు భద్రత చర్యలపై సమీక్ష

### సునీల్ దత్ కీలక ఆదేశాలు

**ఖమ్మం, జనవరి 17, మహా:** ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బ్యాంకు భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కర్ణాటకలోని బీదర్ నగరం శివాజీ చౌక్ వద్ద ఏటీఎం సిబ్బందిపై దుండగులు కాల్పులు జరిపి నగదు చోరీ చేసిన ఘటన నేపథ్యంలో ఈ సమీక్ష జరిగింది. నగదు రవాణా సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించి, బ్యాంకులకు మరింత భద్రత కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి పూట బ్యాంకుల వద్ద పోలీసు పెట్రోలింగ్ కొనసాగించాలని, భారీ లావాదేవీలు జరిగే రోజుల్లో బ్యాంకు మేనేజర్ అభ్యర్థన మేరకు ప్రత్యేక భద్రత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంకులకు భద్రతా సమస్యలు తలెత్తినప్పుడు, సంబంధిత బ్రాంచ్ మేనేజర్ పోలీసులకు సమాచారమిచ్చిన వెంటనే స్థానిక పోలీసులు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. భద్రతా అవసరాల కోసం బ్యాంకులు తుపాకీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మేనేజర్లకు సూచించారు. బ్యాంకు పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారి వివరాలను సేకరించి భద్రతా పరిశీలనలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.